ప్రజాశక్తి

గురువారం 1 ఆగస్టు 2024 5 విజయనగరం



ఆర్‌టిసిలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపిఎస్‌ఆర్‌టిసిలో మెకానిక్ విభాగంలో అప్రెంటిస్ చేసేందుకు ఐటిఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి నారాయణ తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అభ్యర్థులు వారి పేర్లను ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.apprenticeshipindia.gov.in లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్, ఫిట్టర్, పెయింటర్, మెషినిస్ట్, డ్రాఫ్ట్ మాన్ (సివిల్) తదితర ట్రేడ్‌కు సంబంధించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 23వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఆర్‌టిసి జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో ప్రారంభం అవుతుందని తెలిపారు.

- అడుగంటిన నీటిమట్టం
- పూడికలు, తుప్పలతో కుడి, ఎడమ కాలువలు
- జైకా నిధులతో అరకొర పనులు
- ఆండ్ర జలాశయ పర్యవేక్షణ కరువు
- రెగ్యులేటర్ వద్ద లీకులు

ఆండ్ర రిజర్వాయరు రెగ్యులేటర్ వద్ద లీకవుతున్న నీరు



ఈ ఏడాది ఖరీఫ్‌కు ఆండ్ర జలాశయం నుంచి రైతులకు సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. జలాశయంలో నీటిమట్టం అనుకున్న స్థాయిలో లేకపోవడమే అందుకు కారణం. అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలతో రిజర్వాయరులో కొద్ది గొప్ప నీరు చేరినా, నీరు విడుదల చేసే స్థాయికి నీటిమట్టం పెరగలేదు. దీంతో రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందే పరిస్థితి లేదు. మరోవైపు కుడి, ఎడమ కాలువలు అధ్వానంగా తయారయ్యాయి.

ఖరీఫ్‌కు సాగునీరు అందేనా?

ప్రజాశక్తి- మెంటాడ

1998లో ఆండ్ర ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఈ రిజర్వాయర్ పూర్తినీటిమట్టం 146 మీటర్లు. ప్రతి ఏటా 140 నుంచి 144 మీటర్లు కంటే సామర్థ్యం పెరిగే పరిస్థితి లేదు. ఈ ప్రాజెక్టు వల్ల మెంటాడ, గజపతినగరం, బొండపల్లి మండలాలకు సాగునీరు అందుతుంది. కుడి కాలువ ద్వారా 3.6 కిలోమీటర్లు మేర 4,796 ఎకరాలకు సాగునీరు అందించాలి. ఎడమ కాలువ ద్వారా 6.1 కిలోమీటర్ల మేర 4630 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం 140 మీటర్లు లోపు నీటిమట్టం ఉంది. ఇంకా రాతికట్టు వరకు కూడా నీరు చేరలేదు. 142 మీటర్లకు చేరితే తప్ప నీరు విడుదల చేసే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. ఎడమ కాలువకు సంబంధించి హైలెవల్ కెనాల్ నిర్మాణానికి నిధులు కేటాయించారు. కెనాల్ నిర్మాణం మాటేలా ఉన్నా పనులు చేపట్టకుండా నిధులు స్వాహా చేసినట్లు రైతుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఆధునీకరణకు జైకా నిధులు మంజూరు

ఆండ్ర రిజర్వాయర్ ఆధునీకరణ కోసం రూ.16 కోట్లు జైకా నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో కుడి, ఎడమ కాలువల పూడిక తీతలు అరకొరగా చేపట్టి, మిగతా నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రాజెక్టును పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని విద్యుత్తు స్తంభాలు వేశారు. ప్రస్తుతం ఆ స్థంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆధునీకరణ మాటేలా ఉన్నా జైకా నిధులు మాత్రం హాంఫట్ అయినట్లు పలువురి నుంచి విమర్శలు వినవస్తున్నాయి.

రెగ్యులేటర్ వద్ద లీకులు

ప్రాజెక్టుకు కీలకమైనది రెగ్యులేటర్ సిస్టమ్. అత్యవసర సమయాల్లో రిజర్వాయరు సామర్థ్యానికి మించిన నీటిని రెగ్యులేటర్ గేట్ల ద్వారా విడుదల చేయాలి. అటువంటి రెగ్యులేటర్ ద్వారా లీకులు అవ్వడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు పర్యవేక్షణ, నిర్వహణ శూన్యం

ఆండ్ర ప్రాజెక్టుపై ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ శూన్యమని చెప్పాలి. దీని నిర్వహణకు అధికారులను కలవాలంటే రైతులు పట్టణాలకు వెళ్లి కలవాల్సిందే. ప్రాజెక్టుకు ఎప్పుడు వెళ్లినా సంబందిత అదికారుల జాడ కానరావడం లేదు. ఇదేపరిస్థితి కొనసాగితే సుమారు పది వేల ఎకరాలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి అగమ్య గోచరం.

కాలువలు అధ్వానం

రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. మొక్కబడిగా జైకా నిధులతో చేసిన పనులు మూణ్నాళ్ల ముచ్చటగా తయారయ్యాయి. ప్రస్తుత కాలంలో కుడి, ఎడమ కాలువలు పూడికలు, తుప్పలతో పేరుకుపోయి ఉన్నాయి. ఈ తరుణంలో రైతులకు సాగు నీరు ప్రశ్నార్థకమే.



తుప్పలతో కుడికాలువ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

డిసిసిబిలో డిపాజిట్లు పెంచాలి

మహాజన సభలో పర్సన్ ఇన్‌ఛార్జి కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లు, పెట్టుబడులను పెంచేందుకు కృషి చేయాలని ఆ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. బ్యాంకు మహాజన సభ బుధవారం బ్యాంకు సమావేశమందిరంలో జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు సాధించిన ప్రగతి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యకలాపాలు, తీసుకోవాల్సిన చర్యలను ఇన్‌ఛార్జి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు వివరించారు. బ్యాంకు 107వ వార్షిక నివేదికను సభ్యుల ముందుంచారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ, డిసిసిబి వ్యాపారం మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే, గత ఆర్థిక సంవత్సరంలో 14.3శాతం వృద్ధి సాధించడం శుభపరిణావమని పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.183865.32 లక్షలు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.210153.21 లక్షలు వ్యాపారం జరిగిందని తెలిపారు. అదే సమయంలో బ్యాంకు సొంత నిధులు 14.14 శాతం వృద్ధితో, రూ.16412.38లక్షలు నుంచి రూ.18732.46 లక్షలకు పెరిగాయని చెప్పారు. బ్యాంకు డిపాజిట్లు రూ.27654.41 లక్షలు నుంచి 9.27శాతం వృద్ధితో రూ.30218.44లక్షలకు పెరిగాయని తెలిపారు. బ్యాంకు పెట్టుబడులు 16.36 శాతం, ఆప్కాబ్ వద్దనుంచి రుణాలు సుమారు 17.5 శాతం పెరిగాయని తెలిపారు. బ్యాంకు 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 729.37 లక్షల నికల లాభాన్ని ఆర్జించగా, 2023-24 సంవత్సరంలో 746.26లక్షల నికర లాభాన్ని ఆర్జించిందని వివరించారు. డిపాజిట్లను మరింత పెంచేందుకు కృషి చేయాలని కోరారు. పిఎసిఎస్‌లను కంప్యూటరీకరించాలని జెసి సూచించారు. నాబార్డు డిడిఎం నాగార్జున మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంకు పరపతిని పెంచాలని కోరారు. బ్యాంకు సుమారు రూ.1528 కోట్లు నాబార్డు ద్వారా రీఫైనాన్స్ చేస్తోందన్నారు. పిఎసిఎస్‌లు ఆదాయం పెంచుకొని బలోపేతం కావాలని సూచించారు. జిల్లా సహకార అధికారి రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో 65 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, వీటిలో కేవలం 10 మాత్రమే లాభాల్లో ఉన్నాయని, మిగిలిన వాటిని కూడా లాభాలబాట పట్టించడానికి కృషి చేయాలని కోరారు. బైద్యనాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు నష్టాలను తగ్గిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సభలో పార్వతీపురం మన్యం జిల్లా సహకార అధికారి శ్రీరామ్మూర్తి, డిసిఎఒ శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్‌ల పర్సన్ ఇన్‌ఛార్జులు, డిసిసిబి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సౌర విద్యుత్తు సూర్యఘర్ పథకం బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్ఇ తదితరులు

సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి

వినియోగించే వారికి కేంద్ర ప్రభుత్వ రాయితీ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పర్యావరణ పరిరక్షణ కోసం సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్నారు. సౌరవిద్యుత్‌ను వినియోగించే వారికి కేంద్ర ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆయా కుటుంబాలు విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహాల్లో సౌరవిద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకొనే వారికి గరిష్టంగా మూడు కిలోవాట్ల సామర్థ్యం వరకు రాయితీలు కల్పిస్తోందన్నారు. జిల్లాలో ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకం పోస్టర్లను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌తో కలసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక కిలోవాట్ సామర్థ్యంగల యూనిట్‌పై రూ.30 వేల వరకు రాయితీని పొందవచ్చని తెలిపారు. ఈ పథకం కింద ఇళ్లలో సౌరవిద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకొనే ఆసక్తి గలవారు పిఎం సూర్యఘర్ యాప్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ లక్ష్మణరావు చెప్పారు. యూనిట్ల ఏర్పాటుకు జాతీయ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీపై రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు. వినియోగదారులు సౌరవిద్యుత్ ఏర్పాటు చేసుకున్న తర్వాత వారి ఇళ్లకు నెట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని, వారు వినియోగించగా మిగిలిన సౌరవిద్యుత్‌ను తమ సంస్థ యూనిట్ రూ.3.60 వంతున కొనుగోలు చేస్తుందన్నారు. యూనిట్లు ఏర్పాటు చేసిన తర్వాతే వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో రాయితీ మొత్తం జమచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, విద్యుత్ పంపిణీ సంస్థ ఇఇలు ధర్మరాజు, హరి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

పరిమిత సంఖ్యలోనే ప్రశంసాపత్రాలు బహూకరణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆగస్టు 15వ తేదీన జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వివిధ శాఖల ఆధ్వర్యంలో చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పిల్లల్లో దేశభక్తి భావన పెంపొందించే కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులతో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై జిల్లా సమీక్ష నిర్వహించారు. వేడుకల సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు ఇవ్వనున్నామని, అయితే ఆయా శాఖల్లో చిత్తశుద్ధితో అత్యుత్తమ సేవలు అందించిన వారి పేర్లను మాత్రమే సిఫారసు చేయాలని స్పష్టంచేశారు. ఈ ఏడాది పరిమిత సంఖ్యలోనే ప్రశంసాపత్రాలు అందజేస్తామని, అధికారులు దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులను సిఫారసు చేయాలన్నారు. ప్రతి ఏటా జరుపుకున్న తరహాలోనే పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, పథకాల లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. మైదానంలో ప్రదర్శన పూర్తయిన అనంతరం వీలైతే శకటాలను నగరంలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలకు జిల్లా ప్రజలందరినీ ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌ను కలెక్టర్ కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్.డి.అనిత పాల్గొన్నారు.

117 జిఒ రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్



జిఒ నెంబరు 117 రద్దు చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ రవికుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర సహా కార్యదర్శి కె.విజయ గౌరి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సంస్కరణలు వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రైమరీ నుంచి 1, 5 తరగతుల వరకు ఒకే పాఠశాలలో నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, బొబ్బిలి మండలం, పట్టణం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బత్తుల శ్రీనివాస్, స్వామి నాయుడు, రాధాకృష్ణ, శ్రీనివాస్, మహేష్, అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

గతం లో ఉన్న పేరెంట్స్ కమిటీని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ గా మార్పు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ ఎన్నికల మార్గదర్శకాలను అనుసరిస్తూ ప్రశాంతంగా జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణను ఎంఇఒలు, లా అండ్ ఆర్డర్ అంశాలను తహశీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ ఎంఇఒలకు, తహశీల్దార్లకు పలు సూచనలు చేసారు. రాష్ట్రంలోని అన్ని జిలా విద్యా శాఖాధికారులు విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లల ఉచిత, నిర్బంధ విద్యాహక్కులోని సెక్షన్ 21 ప్రకారం ఎన్నుకోబడిన సంస్థ పేరు పేరెంట్ కమిటీకి బదులుగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అనే పదాన్ని ఉపయోగించాలని పాఠశాల విద్యా సఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆగష్టు 1 న ఉదయం 10 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. అదే రోజున ఓటర్ల జాబితాలను పాఠశాల, గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. 5వ తేదీన ఉదయం 9 నుండి 1 గంట వరకు ఓటరు జాబితాలపై అభ్యంతరాలు ఉంటే పరిష్కరించి అదే రోజు సాయంత్రానికి ఫైనల్ ఓటర్ల జాబితాలను ప్రకటించాలన్నారు. ఆగష్టు 8న ఉదయం 7 గంటల నుండి 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. మధాహ్నం 1.30 నుండి 2 గంటల వరకు వైస్ ఛైర్మన్, ఛైర్మన్ ఎన్నిక జరపాలని 2 గంటలకు ఎన్నికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం జరపాలని, 3 నుండి 3.30 గంటల మధ్య తొలి సమావేశం నిర్వహించి మీటింగ్ మినిట్స్‌ను పంపాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని తహశీల్దార్లకు, ఎంఇఒలకు ఆదేశించారు. ఎన్నికల అధికారిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యవహరిస్తారని, ఎన్నికైన సభ్యుల కాల మరిమితి రెండేళ్లు ఉంటుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి సంయుక్త కలెక్టర్ కార్తీక్, డిఇఒ ప్రేమ కుమార్ పాల్గొన్నారు.

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 2న శుక్రవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విటి అగ్రహారం 33/11 కెవి సబ్ స్టేషన్‌లో పాత లైనులు మార్పు పనులు (షిఫ్టింగ్) నిమిత్తం పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.హరి తెలిపారు. విటి అగ్రహారం, బిసి కాలనీ, సంతోష్ నగర్ , గణేష్ నగర్, వై జంక్షన్ , 11 కెవి కోరుకొండ ఫీడర్‌పై ఉన్న ప్రసాద్ నగర్ , మజ్జిపేట, 11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్ మీద ఉన్న వి టి అగ్రహారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల కంపెనీలకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

ఇద్దరు డిఎస్‌పిలకు బదిలీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఇద్దరు డిఎస్‌పిలకు బదిలీ అయ్యింది. ఈమేరకు బుధవారం రాష్ట్ర పోలీస్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చీపురుపల్లి డిఎస్‌పిగా పనిచేస్తున్న ఎఎస్ చక్రవర్తికి పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు రిపోర్ట్ చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం ట్రాఫిక్ డిఎస్‌పిగా పనిచేస్తున్న డి. విశ్వనాథ్‌కు సిఐడి విభాగానికి బదిలీ అయింది.


వీధి దీపాలు వేయండి

సచివాలయం కార్యదర్శికి అయ్యప్పనగర వాసుల వినతి

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఒకటో డివిజన్‌లోని అయ్యపనగర్ లో వీధిలైట్లు వెయ్యాలని, కుక్కలు బారి నుంచి కాపాడాలని కోరుతూ ఆ కాలనీ వాసులు యుఎస్ రవికుమార్, ఎన్ సుధీర్, వరప్రసాద్, ఆదినారాయణ కోరారు. ఈమేరకు బుధవారం ఒకటవ డివిజన్ సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. అయ్యప్ప నగర్ కాలనీలో వీధి లైట్లు వెలగకపోవడం వల్ల రాత్రి సమయంలో ఇళ్లకు వెళ్లాలంటే భయంగా ఉందన్నారు. కుక్కల బెడదతో పాటు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి పాములు వంటి విష షర్పాలు వచ్చేస్తున్నాయని తెలిపారు. కుక్కలు నడిచి వెళ్లిన వారిని,సైకిల్, బైక్ పై వెళ్లిన వారి వెంట పడి భయపెడుతున్నాయని తెలిపారు. వెంటనే వీధి దీపాలు వేసి, కుక్కలు బారి నుంచి కాపాడాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని కోరారు.

సచివాలయ కార్యదర్శికి వినతినిస్తున్న యుఎస్ రవికుమార్ తదితరులు



ప్రశాంతంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - గజపతినగరం

2023-2024 ఆర్థిక సంవత్సరానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉపాధి పీడీ ఉమా పరమేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ ఈ కార్యక్రమంలో ఆడిట్ బృందం గ్రామాల్లో తాము చేపట్టిన నివేదికలను వెల్లడించారు. ఈ ఆడిట్లో అధికంగా కూలీల మస్తర్ల దిద్దుబాట్లులో తప్పిదాలను నివేదించారు. మరికొన్నిచోట్ల వేసిన మొక్కలు సంఖ్యకు క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కలకు గల తేడాలను ప్రజా వేదికలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తౌడు, ఉపాధి ఎపిడి జనార్ధన్ రావు, డిఇ వెంకటరమణ, ఎపిఒ రామారావు, స్టేట్ రిసోర్స్ పర్సన్ లక్ష్మణరావు, ఎంపిడిఒ జయంత్ ప్రసాద్, సర్పంచులు బెల్లాన త్రినాధ రావు, గిడిజాల కామనాయుడు, గేదెల ఈశ్వరరావు, కె. పైడుపునాయుడు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

జిందాల్ రైతుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకు రైతుల వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని జిందాల్ పరిశ్రమ కోసం భూములను కోల్పోయిన రైతుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి జిందాల్ బాధితులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిందాల్ కర్మాగారానికి భూములు ఇచ్చి మూలబొడ్డ వర, పెదకండేపల్లి, ముషిడిపల్లి, కిల్తంపాలెం పంచాయతీలకు చెందిన రైతులు నిర్వాసితులయ్యామమని తెలిపారు. తమ అనుభవంలో ఉన్న డి- పట్టా, జిరాయితీ భూములను నామమాత్రపు ధరకు ఇచ్చేశామని తలెఇపారు. డి-పట్టా భూములకు ఎకరాకు రెండు లక్షలు భూములకు ఎకరాకు ఆరు లక్షలతో పాటు అప్పటి జిందాల్ కంపెనీ ప్రతినిధులు అంతే మొత్తంలో షేర్ ధనము ఇస్తామని చెప్పారని, 16ఏళ్లయినా పరిశ్రమ రాకపోగా షేర్ ధనం కూడా ఇవ్వలేదన్నారు. ఇటీవల కొంతమంది జిందాల్ కంపెనీకి ప్రతినిధులకు బ్రోకర్లు గా మారి మాతో కొన్ని సంతకాలు కొన్ని పేపర్ల మీద చేయించుకున్నారని తెలిపారు. కంపెనీ వస్తుందని మా పిల్లలకు అందులో ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశతో భూములిచ్చి నిర్వాసితులయ్యామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కంపెనీ ఏర్పాటుకు సేకరించిన భూములలో పరిశ్రమలు రాకపోతే తిరిగి ఆ రైతులకే భూములు ఇవ్వాలన్న నిబంధన ఉన్నందున తమ భూములు తమకు ఇప్పించాలని కోరారు.



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న రైతు

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

తొలి రోజే శత శాతం పంపిణీకి ఏర్పాట్లు

2,80,352 మంది లబ్ధిదారులకు రూ.116.67 కోట్ల పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ లబ్ధిదారులకు ఇంటివద్దే చెల్లించడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. క్లస్టర్ వారీగా సచివాలయ సిబ్బంది, గ్రామ స్థాయి సిబ్బందితో పింఛను దారులను మాపింగ్ చేశారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేసేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉంది . నగదును 31వ తేదీనే డ్రా చేసుకొని సంబంధిత సిబ్బంది వద్ద ఉంచారు. గ్రామాల్లో లేని వారికి ముందుగానే టామ్ టామ్ ద్వారా 1వ తేదీన గ్రామంలో తప్పక ఉండాలని సచివాలయ సిబ్బంది ద్వారా తెలియజేసారు. పింఛను పంపిణీకి అవసరమైన మొబైల్, స్కానర్, ఐరిష్, పెన్షన్ రసీదులు సిద్ధం చేసుకోవాలని ఇప్పటికే గ్రామ స్థాయి, సచివాలయ స్థాయి ఉద్యోగులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. మండల ప్రత్యేకాధికారులు , ఎంపిడిఒలు వారి మండలంలో పర్యటించి శత శాతం పింఛన్ల పంపిణీ తొలిరోజే జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. డిఆర్‌డిఎ కాల్ సెంటర్ నుంచి ఉదయం 5 గంటల నుండే పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,80,352 మంది వృద్ధాప్య, వితంతు, చేనేత, కళాకారులు వికలాంగ తదితర పింఛనుదారులకు రూ.116.67 కోట్లు పంపిణీ చేసేందుకు అవసరమైన నగదును బ్యాంకుల నుండి డ్రా చేశారు. ఈ పంపిణీలో సచివాలయ, గ్రామ స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు 5,295 మంది భాగస్వామ్యం కానున్నారు.

తొలిరోజే శత శాతం పంపిణీ చేస్తాం : కలెక్టర్

గత నెలలో మొదటి రోజున 97.02 శాతం పంపిణీ చేసి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఆగస్టు నెల శత శాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉదయం 5 గంటల నుండే పంపిణీ జరుగుతుందని, బయట ప్రాంతాల్లో ఉంటున్న పింఛనుదార్లు సాయంత్రం లోగా వారి గ్రామాలకు విచ్చేసి పింఛను అందుకోవాలని కోరారు. పింఛను పంపిణీ తీరును డిఆర్‌డిఎలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

డీలర్ల సంఘం అధ్యక్షులుగా 'మహంతి'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల డీలర్ల సంఘం అధ్యక్షునిగా గరికిపేట డీలర్ మహంతి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయిలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంఘాన్ని ఎనుకున్నారు. అధ్యక్షునిగా మహంతి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా సతివాడ శ్రీను, కార్యదర్శిగా జరజాపుపేటకు చెందిన ముత్యాలనాయుడు, గౌరవ అధ్యక్షులుగా జగ్గశెట్టిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన సంఘాన్ని పలువురు అభినందించారు.

పాములవలసలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పాములవలస సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాలువల్లో చెత్తను తొలగిస్తూ బ్లీచింగ్ పౌడర్ క్లోరినేషన్ చేయించారు. విద్యుత్‌కు సంబంధించిన పనులు కూడా చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తీయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మురుగునీటి కాలువలలో పూడికలు తీయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని ఆర్ గంగయ్య షాపింగ్ కాంప్లెక్స్, ఎన్‌టిఆర్ బొమ్మ, శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె బుధవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తుండడంతో ఎప్పటికప్పుడు మురుగునీటి కాలువలలో పూడికలు తీయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా చూడాలన్నారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను తొలగించాలని కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - వేపాడ

ఈ నెల ఒకటి నుంచి 14వ తేదీ వరకూ విజయవాడలో జరగనున్న స్వాతంత్ర దినోత్సవ పేరేడ్ శిక్షణకు సోంపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో చదువుతున్న విశ్వనాధ, రాకేష్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ బి.పి.ఎ.రాజు తెలిపారు. రెండు వారాలు శిక్షణ అనంతరం రాష్ట్ర స్థాయిలో విజయవాడలో జరగనున్న ఆగస్టు 15 వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. మారుమూల గ్రామం నుండి రాష్ట్రస్థాయి పేరేడ్‌కు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విద్యార్థులకు మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన ఉండాలని పూసపాటిరేగ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలైన గంజాయి వంటి వాటి వినియోగం, రవాణా వ్యతిరేకతపై అవగాహన ఉండాలన్నారు. పోక్సో చట్టం, న్యూ క్రిమినల్ లాస్, రోడ్డు ప్రమాదాలపై మొబైల్ జాగ్రత్తలు, మైనర్ డ్రైవింగ్ నిషేధం తదితర విషయాలు అవగాహన కల్పించారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు సమాజానికి ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే ఇప్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఆసుపత్రిల్లో, వైద్య కళాశాలలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు వెంటనే జీతాలు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల సిహెచ్‌సి ఆసుపత్రి దగ్గర నిరసన ధర్నా చేపట్టారు. అనంతరం బుగత అశోక్ మాట్లాడుతూ హాస్పిటల్స్‌లో ఉన్న పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నెల్లిమర్ల నాయకులు మొయిద పాపారావు, ఆసుపత్రి పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బిఎల్‌ఒల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

బిఎల్‌ఒలుగా పని చేసిన కాలానికి బకాయిలు చెల్లించాలని సచివాలయ సిబ్బంది తహశీల్దార్ యం.శ్రీనుని కోరారు. తాము రెండు సంవత్సరాలుగా బిఎల్‌ఒలుగా పనిచేసాము, 2024 ఎన్నికల్లో విధుల్లో పాల్గొన్నామని వాటికి రూ.8వేలకు గాను రూ.5వేలు చెల్లించారని వారు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఆర్‌డిఒకు తెలియజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఒలు సబ్బాన సతీష్, సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సతివాడలో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడలో ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా నిర్వహించారు. వైద్యులు కె.ప్రవీణ్ కుమార్ పాడి పశువులకు ముద చర్మ వ్యాధి, గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఎదురుగా పశువులు, మేక నిర్ధారణకు పశువులకు తనిఖీలు చేసి లేగ దూడలకు నట్టల నివారణ ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ళ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలువురు తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తెర్లాం

మండల తహశీల్దార్‌గా హేమంత్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు విఆర్‌ఒలు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలు తెలియజేయాలని, అధికారులు ప్రజా సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని సూచించారు.

ఎస్‌కోట తహశీల్దార్‌గా అరుణకుమారి బాధ్యతల స్వీకరణ

శృంగవరపుకోట: మండల తహశీల్దార్‌గా అరుణకుమారి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. బదిలీపై వచ్చిన అరుణ్ కుమారికి రెవెన్యూ సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి చెక్క కిరణ్, అరుణ్ కుమారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

డెంకాడ తహశీల్దార్‌గా పద్మావతి

డెంకాడ: మండల తహశీల్దార్‌గా వి. పద్మావతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో గుర్ల తహశీల్దార్‌గా పనిచేసే సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం వెళ్లి తిరిగి డెంకాడకు బదిలీపై వచ్చారు. ఈమెకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఇంటింటికీ రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలని తహశీల్దార్ యం.శ్రీను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో డీలర్లు, యండియు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా సరుకులను డీలర్లు డిడిలు చెల్లించి యండియు ఆపరేటర్లకు వారి యూనిట్లకు సరిపడా సరుకులు అందజేయాలన్నారు. ఆయనతో పాటు సిఎస్‌డిటి సాయిశ్రీకృష్ణ, డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని రైతు బజారును విజయనగరం దాట్ అండ్ ఎమ్.ఒ బి.రవికిరణ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి రైతు బజార్ రైతుల దుకాణాలను, కిరాణా దుకాణాలను పరిశీలించారు. రైతు బజార్ రికార్డ్సును తనిఖీ చేశారు. ఆయన వెంట రైతు బజార్ కార్య నిర్వహణ అధికారి సతీష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా టిడ్కో ఇళ్ళు 576 మంజూరు చేశారని ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వలేదని, మొయిద జంక్షన్ సచివాలయం పరిధి సినిమా హాల్ వద్ద అనుమతి లేకుండా ఆరు అంతస్తుల భవనం నిర్మాణం జరిగిందని, మిమ్స్ ఆసుపత్రి 5 ఎకరాలకు 2 ఎకరాలకు పన్ను చెల్లిస్తున్నారని అనుమతి లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. నెల్లిమర్ల జూట్ యాజమాన్యం 6 కోట్ల పన్ను బకాయిలు చెల్లించలేదని, 7వ వార్డులో కాలువ అసంపూర్తిగా ఉందని స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఆయా వార్డుల్లో తాగు నీరు, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రూ.11లక్షలతో అన్న క్యాంటీన్ మిగులు పనులు పూర్తి చేయడానికి, జరజాపుపేట తాగునీటి పథకం మెట్లు నిర్మాణానికి రూ.3లక్షలు, వీధి కుక్కల శస్త్ర చికిత్సలు చేయడానికి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారు కొండ కృష్ణ, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, మైపాడ ప్రసాద్, ముడుమంచి లక్ష్మీ, మజ్జి నాగమణి, మొయిద శ్రీనివాసరావు, పొందూరు సత్యవతి, నాయకులు లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల వాసులకు ఉపాధి కల్పించాలి: వార్డు కౌన్సిలర్లు

స్థానిక ప్రజానీకానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, పైల భారతి ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో ఎటువంటి ఉపాధి లేకుండా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని గత ప్రభుత్వాలు ఈ ప్రాంతానికి ఉపాధి కల్పించకుండా నిర్లక్ష్యం వహించాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజక వర్గంలో అనేక కంపెనీలు ఉన్నాయని వాటిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని తీసుకు వచ్చి అధిక మొత్తంలో జీతాలు ఇస్తున్నారు గాని ఇక్కడి వారిని పట్టించుకోలేదని తెలిపారు. నగర పంచాయతీగా మార్పు చేయడం వల్ల నెల్లిమర్ల, జరజాపు పేట గ్రామాలకు ఉపాధి హామీ పనులు కోల్పోయారని ఈ రెండు గ్రామాలకు వేరే విధంగా ఉపాధి కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి

బొబ్బిలి: పిల్లలకు చేతుల పరిశుభ్రత, ఆరోగ్యవంతమైన అలవాట్ల గురించి నేర్పించాలని డిప్యూటీ డిఇఒ కె.మోహన్‌రావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, డేటాల్ బనేగా స్వస్థ్ ఇండియా (డిబియస్ఐ) సంయుక్తంగా దీనిపై ప్రత్యేక కార్యక్రమాలు ఏడాది పొడవునా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంఇఒ సిహెచ్.లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం స్థానిక యఎస్.యఎస్.యస్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహిoచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లను విద్యార్థులకు పాఠశాలలలో చదువులతో పాటుగా నేర్పించినప్పుడే మానసికంగా శారీరకంగా పరిపూర్ణమైన విద్యార్థి గా తయారవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ టి లక్ష్మి, డిబియస్ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వి భగవాన్ దాస్, రిసోర్స్ పర్సన్ శంకరరావు, చైల్డ్ వెల్ఫేర్ సభ్యులు చిట్టిబాబు వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయండి

కౌన్సిల్ సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు డిమాండ్

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని టిడిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. తాగునీటి కోసం అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్న ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు ఇవ్వడం లేదని టిడిపి కౌన్సిలర్లు వి.హైమవతి, ఆర్.శరత్ ప్రశ్నించారు. విద్యుత్ సమస్య వల్ల తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ ఏఇ సురేష్ చెప్పారు. పైపులైన్ లీకులతో తాగునీరు కలుషితం అవుతుందని, లీకులను నివారించి సురక్షితమైన తాగునీరు ఇవ్వాలని టిడిపి కౌన్సిలర్ ఆర్.శరత్ కోరారు. కుక్కలను నివారించాలని వైసిపి కౌన్సిలర్ ఎం.తిరుపతిరావు కోరారు. పట్టణంలో హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పాణిపూరి షాపులలో ఫుడ్ నాణ్యతను పరీక్షించాలని వైస్ చైర్మన్ చెలికాని మురళి కోరారు. చాకలివీధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని టిడిపి కౌన్సిలర్ బి.సురేష్ ప్రశ్నించారు. టిడిపి వార్డులను పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు నాటి ఐరన్ గార్డ్స్ పెట్టేందుకు తీర్మానం చేయగా శరత్ అభ్యంతరం తెలిపారు. గతంలో మొక్కలు నాటి గార్డ్స్ ఏర్పాటు చేసినా ఎక్కడా గార్డ్స్ లేవని, మొక్కలు కూడా బతకలేదని అన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

చినబజారు రోడ్డు శంకుస్థాపనకు కౌన్సిలర్లకు ఆహ్వానించి మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ ఉండకుండా అవమానించారని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, టిడిపి కౌన్సిలర్ వి.హైమవతి అన్నారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గెంబలి శ్రీనివాసరావు కోరారు. భవిష్యత్తులో ఇటువంటి తప్పిదాలు జరగకుండా చూస్తామని కమిషనర్ రామలక్ష్మి అన్నారు. పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక ఎస్‌కోట డిపో నుంచి విశాఖకు సరికొత్త ఆల్ట్రా పల్లెవెలుగు బస్సును స్థానిక డిపో మేనేజర్ కె. రమేష్ అధ్యక్షతన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సు ప్రతి రోజు ఎస్. కోట నుంచి విశాఖకు ఉదయం 7.45, 11.30, 3.20 నిముషాలకు, విశాఖ నుంచి తిరిగి ఎస్.కోటకు 9.45, 1.35, 5.15 నిముషాలకు ఉంటుందని చెప్పారు. ఎస్. కోట నుంచి విశాఖకు 65 రూపాయలు, కొత్తవలసకు 35 రూపాయలు, కొత్తవలస నుంచి విశాఖపట్నంకు 40 రూపాయలు చార్జీ వసూలు చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా డిపోకు మరిన్ని బస్సులు, సిబ్బందిని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - రాజాం

మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. రాజాం పట్టణ పరిధిలో గల గాయత్రీ కాలనీ గాయత్రీ దేవీ ఆలయం సమీపంలో రూ.7.25 లక్షల వ్యయంతో కల్వర్టుకు, చర్చి సమీ పంలో గల వీధిలో రూ.8 లక్షలతో మరో కల్వర్టు, తెలగావీధిలో రూ.2.25 లక్షలతో మూడు కల్వర్టులకు, వాసవీ థియేటర్ వెనక వీధిలో గల శ్రీరాంనగర్ కాలనీలో రూ.2.25లక్షలతో సీసీ రోడ్డు, పొనుగుటివలసలో రూ.8లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలరోజుల్లో మరో ఏడుకోట్ల రూపాయలతో రాజాం టౌన్ వీధుల్లో కాలువలు, సీసీ రోడ్లకు నిధులు తెస్తామన్నారు. అనంతరం రాజాం శ్రీనివాసా రోడ్డులో గల జూనియర్ కళాశాలలో, సారధిలో గల బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాగుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, నాయకులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్ద పీట

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ రావుతో మాట్లాడి కళాశాల స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం మడ్డువలస అంబేద్కర్ గురుకుల పాఠశాల గెస్ట్



రాజాం: పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఫ్యాకల్టీ తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, లచ్చుబుక్త కృష్ణమూర్తి, పైల వెంకటరమణ, ఉదయాన మురళీకృష్ణ రావు, మజ్జి గణపతి, బెజ్జిపురం రవి, వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రేగిడి: భారత నిర్మాణ సేవా కేంద్రాలు, సచివాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం బూరాడ గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన భారత నిర్మాణ సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, మాజీ జెడ్‌పిటిసి మంతన ఉష, నాగభూషణం, పాలూరి రామినాయుడు, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఎం బాసిన గోవిందరావు, ఎంఇఒ వరప్రసాదరావు, డబ్ల్యూఎస్ శ్రీ చరణ్, ఎపిఒ హరినాథ్, హౌసింగ్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.


సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి - కొత్తవలస

ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం ఆనందంగా గడపాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. బుధవారం మండలంలోని వీరభద్రపురం గ్రామంలో గణిత ఉపాధ్యాయులు జక్కు శివాజీ పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 సవంత్సరాల విధినిర్వహణలో అంకితభావంతో పని చేసి వీరభద్ర పురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, కోళ్ల శ్రీను, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపునిస్తాయి

పూసపాటిరేగ: ఉద్యోగులు పనిచేస్తున్న సమయంలో అందిన సేవలే గుర్తింపునిస్తాయని సర్పంచ్ ఇజ్జురౌతు అప్పలరాజు అన్నారు. బుధవారం మండలంలోని రెల్లివలస పంచాయతీ కార్యదర్శి త్రినాదరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం రెల్లివలస సచివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపిపి మహంతి చిన్నంనాయుడు, ఎంపిపి ప్రతినిధి మహంతి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, సీనియర్ నాయకులు వెంపడాపు



కొత్తవలస: శివాజీ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సూర్యనారాయణ, ఇజ్జురౌతు ఈశ్వరరావు, ఉప సర్పంచి గొర్లె రమణ, ఎంపిడిఒ రాధిక, పంచాయతీ అధికారి శ్రీనువాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారంతా ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి, దుస్సాలువాలతో సత్కరించారు.

గజపతినగరం: ప్రధానోపాధ్యాయుడిగా కృష్ణమూర్తి నాయుడు అందించిన సేవలు మరువలేనివని గజపతినగరం ఎంఇఒలు ఎస్.విమలమ్మ, సాయి చక్రధర్, మెంటాడ ఎంఇఒ శివాజీ అన్నారు. మండలంలోని గంగచోళ్ళ పెంటలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కృష్ణమూర్తి నాయుడును పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.రమేష్ కుమార్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి - కొత్తవలస

వ్యవసాయంలో అంతర్ పంటలు వేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామ ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ సజ్జ పంటలపై క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ వరి పంట వేయక ముందు రైతులందరూ అదనపు ఆదాయం తీసుకోవచ్చని, అంతర పంటలు వేయడం వల్ల ప్రధాన పంటకు అయ్యే ఖర్చును భర్తీ చేయవచ్చని తెలిపారు. అంతర పంటలు వేయడం వల్ల చీడపీడలను అరికట్ట వచ్చున్నారు. సజ్జ పంటలో అంతర పంటలు గోంగూర, తోటకూర, బెండ, చిక్కుడు, ఆనప పంటలు వేసి కొంత ఆదాయం కూడా తీసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో విఎఎ దుర్గారావు, ప్రకృతివ్యవసాయ కార్యకర్త శ్రావ్య, రైతులు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలు అవసరం

బాడంగి: వరి నాట్లు జరిగిన తరువాత ప్రతి రైతు తప్పనిసరిగా కాలిబాటలు వేసుకోవాలని వ్యవసాయ



బొబ్బిలి రూరల్: సేంద్రియ ఎరువుల తయారీ చేయిస్తున్న ఎడి

సహాయకులు వాడాడ సాయికుమార్ సూచించారు. మండలంలోని పినపెంకి బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలు వేసుకోవడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి పిలకలు పెట్టి దుబ్బు బాగా పెరిగి దిగిబడి వస్తుందన్నారు. ఎరువులు, పురుగు మందులు వేసేటప్పుడు ఈ కాలిబాటలలో వెళ్లి వేయడం వల్ల పొలంలో సమంతరంగా పడి సమయం, శ్రమ వృథా కాకుండా ఉంటుందన్నారు.

సేంద్రియ ఎరువు తయారిపై శిక్షణ

బొబ్బిలిరూరల్: సేంద్రియ ఎరువు తయారీపై బుధవారం కోమటిపల్లి గ్రామంలో రైతు అట్టాడ తిరుపతి పొలం వద్ద వేస్ట్ డీకంపోజర్ అనే సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని ఆ రైతుతో వ్యవసాయ శాఖ ఎడి యం.శ్యాంసుందర్ తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేస్ట్ డీకంపోజర్ అనే సేంద్రియ ఎరువు వల్ల మనం పంటలో ఎటువంటి రసాయన ఎరువులనూ వాడనవసరం లేదన్నారు. కేవలం 30 గ్రాముల వేస్ట్ డీకంపోజర్‌తో 200 లీటర్ నీటిలో కలుపుకొని దానికి పప్పుల పిండి, బెల్లం కలుపుకొని ఆ 200 లీటర్ ద్రావణాన్ని ఒక ఎకరానికి ఎరువుగా వాడుకోవాలన్నారు. ఆ విధానాన్ని రైతులకు పరిచయం చేశారు. ఆ రైతు తన పొలంలో వేసిన సాంబ మసూరి రకం వరుసల్లో నాటు వేసే విధానం చూసి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, కోమటిపల్లి గ్రామ వ్యవసాయ సహాయకులు పొట్నూరు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



గుంతలను కప్పుతున్న యంత్రం

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట కూడలి వద్ద రోడ్డుకు భారీగా పడిన గుంతలను బుధవారం పూడ్చారు. గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సామాజిక కార్యకర్త అప్పారావు ఇటీవల జరిగిన ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎంపిడిఒ గుంతలను పూడ్చాలని ఇఒపిఆర్‌డి ఉమాకు ఆదేశించారు. దీంతో ఈ పనులను చకచకా చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ. ఉప సర్పంచ్ రుద్ర వెంకటరావు పాల్గొన్నారు.

15 తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని పారాదిలో చోరీ జరిగింది. పారాది గ్రామానికి చెందిన గంట నాగమణికి ఆరోగ్యం బాగోకపోవడంతో పారాదిలో తన ఇంటికి తాళం వేసి బొబ్బిలిలో ఉన్న చెల్లెలు ఇంటికి వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండడంతో గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి తలుపులు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు నగలను అపహరించుకుపోయారు. బీరువా తలుపులు రాకపోవడంతో బీరువాను కిందన పడేసి తలుపులు పగలగొట్టి నగలను అపహరించుకుపోయారు. ఇంటిలో ఉన్న సామగ్రిను చిందరవందరగా చేశారు. బుధవారం తెల్లవారిసరికి తలుపులు పగలగొట్టి ఉండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 15తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితరాలు నాగమణి చెప్పింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ లోవరాజు, ఎఎస్ఐ భాస్కరరావు చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలను సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

చీపురుపల్లి: ఉరేసుకొని నాయిని రవిరాజ్ కుమార్ (42) ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి చీపురుపల్లి ఎస్ఐ కె కిరణ్ కుమార్ నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీపురుపల్లి పట్టణంలో రవి కుమార్ గత కొంత కాలంగా కొత్త గవిడి వీధిలో ఒక హోటల్ నడుపుతున్నాడు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులతో పాటు, స్థానికంగా కొంతమంది దగ్గర అప్పులు చేసాడని ఎస్ఐ తెలిపారు. ఈ క్రమంలో అప్పులు బాధలు ఎక్కువవ్వడంతో గవిడి వీధిలో నివాశముంటున్న వంట గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి, ఇన్నిస్ పేటకు చెందిన వాడిగా స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జామి : మండలంలో నూతనంగా నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎల్‌కోట మండలం భీమాలి గ్రామానికి చెందిన నెల్లి మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదులోని వివరాలు ప్రకారం.. తన భర్త నెల్లి గౌరునాయుడు తన మోటారు సైకిల్ పై గొలజం గ్రామం నుండి భీమాలి వెళ్తూ జామి గ్రామం సమీపంలోని రింగ్ రోడ్ కూడలి వద్ద రోడ్ రైలింగ్‌ను ఢీ కొట్టాడు. స్థానికులు గుర్తించి విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతు చెందాడు. మృతుడుకి ఇద్దరు పిల్లలు ఉన్నారు. హెచ్ఐ ఈశ్వరావు కేసు నమోదు చెసి, దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయ నిర్మాణ సంస్థ తీరుతో
రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి భోగాపురం

మండలంలోని సవరవల్లి జాతీయ రహదారి నుంచి జమ్మయ్యపేట వెళ్లే రహదారిలో విమానాశ్రయ నిర్మాణ స్థలం నుంచి వస్తున్న వరద నీటితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విమానాశ్రయ నిర్మాణ సంస్థ కనీసం పట్టించుకోవడంలేదని వివిధ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణంలో పాత తారు రోడ్డును తొలగించి కొత్తగా విమానాశ్రయ ప్రహరీ గోడ నుంచి మట్టి రహదారిని నిర్మించారు. దానిపై తారు రోడ్డు వేయకపోవడంతో వర్షం పడితే చాలు బురదతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 రోజుల నుండి ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నామని, దీనిపై సంబంధిత విమానాశ్రయ నిర్మాణ సంస్థ అధికారి దృష్టికి తీసుకు వెళ్లినట్లు కౌలువాడ గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు కోరాడ తాతారావు తెలిపారు. అధికారులు కానీ పట్టించుకోకపోతే తమ నాలుగైదు గ్రామాల ప్రజలందరం విమానాశ్రయ నిర్మాణ సంస్థ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.



రోడ్డును చూపిస్తున్న తాతారావు